క్లుప్తంగా

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చండూరు : గృహజ్యోతి పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని చండూరు విద్యుత్ ఏఈ వి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే గృహ విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకానికి అర్హులని అన్నారు. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, ప్రజా పాలన దరఖాస్తు నంబర్, విద్యుత్ సర్వీసు కనెక్షన్ నంబర్ల పత్రాలను విద్యుత్ సిబ్బందికి కానీ, చండూరు విద్యుత్ కార్యాలయంలో గానీ ఫిబ్రవరి 15వ తేదీలోపు ఇవ్వాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ


ఎన్.శ్రీను

కట్టంగూర్ : కట్టంగూర్ ఎస్ఐగా ఎస్.శ్రీను ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ డి.రాజు బదిలీపై తిప్పర్తి మండలానికి వెళ్లారు. నల్లగొండ సీసీఎస్ నుంచి ఎస్ఐ శ్రీను కట్టంగూర్‌కు వచ్చారు.

కనగల్ ఎస్ఐగా కొనసాగనున్న బి రామకృష్ణ


రామకృష్ణ

కనగల్: కనగల్ ఎస్ఐగా బి.రామకృష్ణ కొనసాగనున్నారు. ఈయన రెండు నెలలుగా కనగల్ ఎస్ఐగా పనిచేస్తూ 4 రోజుల క్రితం నల్లగొండ డీఎస్‌బీకి బదిలీ అయ్యారు. రామకృష్ణ స్థానంలో నల్లగొండ వీఆర్‌లో విధులు నిర్వహిస్తున్న ఇరుగు రవిని కనగల్‌కు బదిలీ చేశారు. రవి కనగల్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించకముందే వాడపల్లికి బదిలీ చేసి మళ్లీ రామకృష్ణను ఆదివారం కనగల్ బదిలీ చేశారు. రెండు నెలల్లో 4 గురు ఎస్ఐలు స్థానచలనం కావడం విశేషం.

వాసవీమాతకు అభిషేకాలు


అభిషేకాలు చేస్తున్న భక్తులు

నకిరేకల్: వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా నకిరేకల్‌లోని వైశ్య భవన్‌లో మహిళా ఆర్యవైశ్య, మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘాలు, వాసవి వనితా క్లబ్, వాసవీ కపుల్స్ విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ మాతకు పంచామృత అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. వాసవీ మాత పారాయణం చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ వేడుకల్లో వీర్లపాటి నర్సింహారావువీణ, బెల్దె శ్రీను, గుండా కరుణాకర్, సోమ కృష్ణవేణి, వాడకట్ల రాధిక, గుడిపాటి రవి, కందగట్ల భవాని, గుడిపాటి రవి, వజ్రపు సంతోష్ కుమార్, ఉప్పల వెంకటరమణ, శివ కోటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా కత్తుల జగన్‌కుమార్


నియామక పత్రం అందజేస్తున్న కత్తుల మల్లేశం

నల్లగొండటౌన్: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా కత్తుల జగన్‌కుమార్ నియమితులయ్యారు. ఆదివారం స్థానికంగా జరిగిన ఉమ్మడి జిల్లా సంక్షేమ సంఘం సమావేశంలో జగన్‌కుమార్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల మల్లేశం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కత్తుల మల్లేశం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ సంఘం పట్టణ, మండల, డివిజన్ స్థాయి కమిటీలను రద్దు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కత్తుల మహేష్, కత్తుల యాదయ్య, గడ్డం సహదేవ్, కత్తుల సూర్యనారాయణ, కాశయ్య, కొండేటి వెంకట్, దాసరి వెంకట్, కత్తుల యాదగిరి, లింగస్వామి, సన్ని పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం


చెక్కు అందిస్తున్న ఎస్ఆర్ఐ శశికుమార్

కనగల్ : దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి ఎస్ఆర్ఐ బాబా డ్రిల్లింగ్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ వందనపు శశికుమార్ ఆదివారం లక్ష రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా శశికుమార్ మాట్లాడుతూ కంపెనీ తరపున త్వరలో మరో మూడు లక్షల విరాళం ఇస్తామని ప్రకటించారు. అనంతరం రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బాబా డ్రిల్లింగ్ కంపెనీ జీఎం దేప కరుణాకర్ రెడ్డి, ఆలయ సీనియర్ అసిస్టెంట్లు జినుకుంట్ల చంద్రయ్యగౌడ్, చిలుకరాజు లింగయ్య, ఆలయ అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రావణ్ కుమారాచార్యులు, గాదె ఉమామహేశ్వర్ రావు, జూనియర్ అసిస్టెంట్ లింగస్వామిలు పాల్గొన్నారు.

మునుగోడు పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

- రోగులకు అందని మెరుగైన వైద్యం
- సాయంత్రం తర్వాత అరకొర సేవలు


మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మునుగోడు: మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్న సిబ్బందిలో దాదాపు 8మందికి పైగా వివిధ ప్రాంతాల్లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తుండగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో డిప్యూటేషన్లపై వెళ్లిన సిబ్బంది అంతా తిరిగి మునుగోడు ఆరోగ్య కేంద్రంలో విధుల్లో చేరినా ఇంకా కొంత సిబ్బంది కొరత నెలకొంది. దీంతో మండల ప్రజలకు అరకొరగా వైద్య సేవలు అందుతున్నాయి.

ఒక్కరే స్టాఫ్ నర్సు..

పీహెచ్‌సీల్లో నిబంధనల ప్రకారం ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక సీహెచ్‌ఓ, ఒక పీహెచ్‌ఎన్, ఇద్దరు హెచ్‌ఈఓలు, ఒక పీఎంఓ, ఒక యూడీసీ, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఒక ఫార్మసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు అంటెండర్లు, ఇద్దరు ఆయాలు, ఒక డ్రైవర్ మొత్తం 21 మంది సిబ్బంది ఉండాలి. కానీ మునుగోడు పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్ నర్సులకు గాను ఒక్కరు మాత్రమే ఉన్నారు. మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు యూడీసీ, కంప్యూట్ ఆపరేటర్ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్లను కాంట్రాక్టు పద్ధతిన నియమించి వారి చేత సేవలు అందిస్తున్నారు. ఆయా పోస్టులు రెండు ఖాళీగా ఉండంతో స్థానికంగా ఇద్దరిని నియమించుకొని రోగులకు అవసరమైన సేవలు అందిస్తున్నారు.

సాయంత్రం తర్వాత అంతంతమాత్రమే..

పీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్న సిబ్బంది కూడా సాయంత్రం 4గంటల తర్వాత ఇంటి బాట పడుతుండడంతో రాత్రి సమయంలో వచ్చే రోగులకు సరైన సేవలు అందడం లేదు. డాక్టర్ లేని సమయంలో స్టాఫ్ నర్సులు ఉండి వైద్య సేవలు అందించాల్సి ఉండగా ఉన్నది ఒక్కరు మాత్రమే కావడంతో వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే ఆమె విధులు నిర్వహిస్తుంది. మిగిలిన రోజుల్లో ఉప ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఏఎన్ఎంలు సాయంత్రం వచ్చే రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పీహెచ్‌సీలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. పెద్ద ఆస్పత్రి ఉండాల్సిన స్థానంలో కేవలం పీహెచ్‌సీ ఉండటంతో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందడం లేదు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.

– కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్

రాత్రి వేళ డాక్టర్ ఉండాలి



ఏదైనా అనారోగ్యానికి గురై రాత్రి సమయంలో పీహెచ్‌సీకి వెళ్తే కేవలం ఒక స్టాఫ్ నర్సు మాత్రమే ఉంటున్నారు. పెద్ద డాక్టర్ ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. దీంతో ఆ స్టాఫ్ నర్సు ఇచ్చిన మందులు తీసుకోవాల్సి వస్తుంది. రాత్రివేళ డాక్టర్ అందుబాటులో ఉంటే బాగుండు.

– ఏరుకొండ నాగరాజు, మునుగోడు

దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలి


నల్లగొండ టౌన్ : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నల్లగొండటౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా భవన నిర్మాణ కార్మికులు పని బంద్ నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భాస్కర్ టాకీస్ కూలీల అడ్డాలో బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కార్మికుల హక్కులను హరించివేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో చలిగోజు సైదాచారి, సోలిపురం సంబిరెడ్డి, గుండె రవి, ఎండమల్ల వెంకన్న, సాగర్, మల్లయ్య, రేవల్లి యాదయ్య, పోతెపాక సహదేవులు, ఉంగరాల సైదులు, దాసరి నర్సింహ, విష్ణుమూర్తి, జానయ్య, నాగరాజు, వెంకన్న యాదవ్, సుశీల, వెంకటమ్మ, యాదమ్మ, అండాలు, అలివేలు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. చిట్యాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో దేశ వ్యాప్త సమ్మె ప్రచార పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు అర్రూరి శ్రీను, సీఐటీయూ నాయకులు రాచకొండ శ్యాంసుందర్, రుద్రవరం మహేష్, కడకంచి నర్సింహ, ఐతరాజు గోపాల్, శ్రీను, లింగస్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

కట్టంగూర్ : కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న తీరును ఎండగట్టేందుకు ఈ నెల 16న చేపట్టే దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యుడు గుడుగుంట్ల రామకష్ణ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు కంకణాల శోభ, కార్యదర్శి మాచర్ల యాదమ్మ, మంగమ్మ, గణేష్, నాగులపాటి ఎల్లమ్మ, సరిత, యాదమ్మ, లక్ష్మమ్మ, రామలింగయ్య, ఎడ్ల ముత్తమ్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి


నల్లగొండ టూటౌన్: ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్య, మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ టూటౌన్: కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ కోరారు. ఆదివారం నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ రోడ్డులో బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తో కలిసి పరిశీలించి మాట్లాడారు. వారివెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సింగం రామ్మోహన్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, సందినేని జనార్దన్‌రావు తదితరులు ఉన్నారు.

బహిరంగ సభ జయప్రదం చేయాలి

ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభకు ప్రజలు, రైతులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి కోరారు. ఆదివారం నల్లగొండలోని గుత్తా నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే మన హక్కులు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం వల్ల జిల్లా ప్రజలకు సాగు, తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు వస్తాయన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఎక్కడి నుంచి అయినా పోటీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, అయితగాని స్వామిగౌడ్, హరికృష్ణ, నాగులంచ వెంకటేశ్వరరావు, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, మోయిజ్, సంజీవ, చిలకరాజు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనగల్: ఈ నెల 13న జరిగే చలో నల్లగొండ భారీ బహిరంగ సభకు కనగల్ మండలం నుంచి ప్రతి రైతు కదిలివచ్చి విజయవంతం చేయాలని ఎంపీపీ కరీంపాష, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్య గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీటీసీ నామ కౌసల్యనగేష్, కడారి కృష్ణయ్య, ఎర్రమాద వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ చనగోని అంజమ్మ రామచంద్రుగౌడ్, మండల యూత్ అధ్యక్షుడు చనగోని నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చలో నల్లగొండను విజయవంతం చేయాలి

చిట్యాల: ఈ నెల 13వ తేదీన జరిగే 'చలో నల్లగొండ' సభను విజయవంతం చేయాలని చిట్యాల మండల బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ సాధనలో భాగస్వాములు కావాలని కోరారు.

ఆలయ కమిటీ ఎన్నిక


అనంతరెడ్డి చైర్మన్


వెంకటయ్య కన్వీనర్

నాంపల్లి: మండల కేంద్రంలోని శ్రీ ఉమా నాగ లింగేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పెద్దిరెడ్డి అనంతరెడ్డి, కన్వీనర్‌గా పానగంటి వెంకటయ్య, వైస్ చైర్మన్లుగా వీరమళ్ల నాగరాజు, పూల చక్రధర్, బిరుదోజు సుదర్శన్‌చారి, పూల శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా కామిశెట్టి యాదయ్య, పంగ కొండయ్య, తిరుమణిశేఖర్, పూల శివ, నాంపల్లి భిక్షం, పన్నాల మల్లయ్య, కోశాధికారిగా పూల యాదగిరి, సాంస్కృతిక కార్యదర్శిగా నాంపల్లి చంద్రమౌళి, ప్రచార కార్యదర్శిగా కొరే మురళి, ఏదుళ్ల రాములు, సహాయ ప్రచార కార్యదర్శులుగా పూల ఆనంద్, కామనబోయిన ఈశ్వరయ్య, గాదెపాక రమేష్, ఆరుగురు గౌరవ అధ్యక్షులు, ఆరుగురు గౌరవ సలహాదారులు, 15మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పూల వెంకటయ్య, కోట రఘునందన్, చిరుమావిళ్ళ గిరిబాబు, పెద్దిరెడ్డి రాజు, పన్నాల మల్లయ్య, ఈద శేఖర్, రాములు, సుదర్శన్‌చారి, కామనబోయిన గిరి, నాగరాజు, కేశవులు, ఈశ్వరయ్య, పూల వేలాద్రి, శంకర్, రాశిక వెంకటయ్య పాల్గొన్నారు.

పిల్లల మనోవికాసానికి కథలు దోహదం


కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వెంకటరమణ

చండూరు : పిల్లల మనోవికాసానికి కథలు ఎంతగానో దోహదపడతాయని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బాల సాహిత్య పరిషత్, మాచిరాజు బాల సాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చండూరు హైస్కూల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రాసిన బంతిపూలు.. బహుమతి బాలల పుస్తకాలను రేవూరి అనంత పద్మనాభరావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కథలు చదవడం వల్ల విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులకు పాఠశాలల్లో ఏర్పాటుచేసే గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. బాల సాహిత్యం విద్యార్థులకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వసుంధర, దాసరి వెంకటరమణ, మాచిరాజు కామేశ్వరరావు, ఉండ్రాళ్ల రాజేశం, సమ్మెట ఉమాదేవి, అమరవాది నీరజ, పెందోట వెంకటేశ్వర్లు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో అలరించిన చిన్నారుల ప్రదర్శన


నల్లగొండ టౌన్ : పుట్టపర్తిలో సత్యసాయి యాత్రలో పాల్గొన్న భక్తులు

నకిరేకల్ : పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి బాబా సన్నిధిలో నకిరేకల్‌కు చెందిన చిన్నారులు వివిధ ప్రదర్శనలు ఇచ్చి అబ్బురపరిచారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరితి యాత్ర సందర్భంగా నకిరేకల్ నుంచి 160 మంది, మరో 45 మంది బాల వికాస్ చిన్నారులు పుట్టపర్తికి వెళ్లి మూడు రోజులుగా వివిధ ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

పల్లకీ సేవల్లో..

నల్లగొండటౌన్: సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లా సత్యసాయి సంస్థల సభ్యులు, భక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి యాత్రలో పాల్గొన్నారు. పుట్టపర్తి పుర వీధుల్లో సాయిబాబా పల్లకి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు డి. శ్రీనివాస్, వెంకట్‌రావు, జె. రత్నాకర్, వంకాయల సుబ్బారావు, సునితా లక్ష్మయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


నకిరేకల్: పుట్టపర్తిలో వేడుకల్లో పాల్గొన్న నకిరేకల్‌కు చెందిన చిన్నారులు

కఠిన చర్యలు తీసుకోవాలి

నల్లగొండటౌన్: సూర్యాపేట మండలం ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దగ్గుబాటి వైష్ణవి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని అన్నారు.

ఎమ్మెల్యే వీరేశానికి వినతి


ఎమ్మెల్యే వీరేశాన్ని సన్మానిస్తున్న ఉద్యోగులు

నల్లగొండ: ఆరోగ్యశ్రీ పథకంలో పని చేసే సిబ్బంది ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిసి తమ సమస్యలు విన్నవించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వేతనాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వారు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య, గోవింద్‌రెడ్డి, నరేష్‌కుమార్, నాగరాజు, సైదులు, గోవర్ధన్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

నకిరేకల్ : మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన పుట్ట రేణుక అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆమె శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సులో బీమా చేయడంతో మంజూరైన రూ.6,71,198 చెక్కును నకిరేకల్‌లో ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా రేణుక భర్త కృష్ణయ్యకు అందజేశారు. ఇన్సూరెన్సు కంపెనీ డీజీఎం నరేందర్, బ్రాంచ్ మేనేజర్ రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

చౌటుప్పల్ : మండల పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామ శివారులో నిర్వహించిన వెస్ట్ చౌటుప్పల్ ప్రీమియం లీగ్–1 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు సమావేశంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడిన వారు క్రీడా స్ఫూర్తితో ఉండాలని సూచించారు. విజేతలకు అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, నిర్వాహకులు, మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


నల్లగొండ : మంత్రి కోమటిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

నల్లగొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సెర్ప్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి నర్సయ్య, మోహన్‌రెడ్డి, వి. యాదయ్య, నరహరి, భాషపాక చంద్రశేఖర్, మైశేశ్వరరావు, బి.శ్రీనివాస్, వినోద పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని సన్మానించిన నల్లగొండ క్లబ్ సభ్యులు

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం నల్లగొండ క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్లబ్ సభ్యుల వినతి మేరకు ఫిల్మ్‌నగర్ క్లబ్, గ్యాంకానా క్లబ్‌లకు అనుమతి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, గోనారెడ్డి, గోలి అమరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నల్లగొండటౌన్: ఐఎన్‌టీయూసీ క్యాలెండర్, డైరీని ఆదివారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఆరోగ్య శాఖలో ఉద్యోగులకు వ్యతిరేకంగా జారీ చేసిన జీవో 142 రద్దు చేయాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మొగరాల శ్రీనివాస్, పాశం గోవింద్‌రెడ్డి, పాపాయిగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, శ్రవణ్, జ్ఞానేశ్వర్, భూషణ్, బైరబోయిన భిక్షం, నరసింహచారి, అంజయ్యగౌడ్, అన్నమ్మ, రామలక్ష్మి, మధుసూదన్, జమాలుద్దీన్, నరసయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న యరగండ్లపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి హైస్కూల్‌లో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్య బోధించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో కల్లెం జైపాల్ రెడ్డి, జమ్ముల వెంకటేష్, లాలునాయక్, యాదయ్య, నర్సింహ, యాదగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా గుట్టపైకి రెయిలింగ్ పనులు


పనులను పరిశీలిస్తున్న చైర్మన్ మీనారెడ్డి

కేతేపల్లి: మండలంలోని బండపాలెం గ్రామంలో గుట్టపై గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం వద్దకు వెళ్లే మెట్ల మార్గంలో ఏర్పాటు చేస్తున్న స్టీల్ రెయిలింగ్(రక్షణగోడ) పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పోశం రామదాసు, మణెమ్మ దంపతులు మెట్లకు రెయిలింగ్ ఏర్పాటు కోసం రూ.2.5 లక్షలు విరాళం అందజేశారు. రెయిలింగ్ ఏర్పాటు పనులను సోమవారం ఆలయ చైర్మన్ మారం మీనారెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెయిలింగ్ పనులు పూర్తయితే ప్రతి ఏటా నిర్వహించే శ్రీరామనవమి వేడుక సందర్భంగా గుట్టపైకి వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

గడ్డివాము దగ్ధం

కట్టంగూర్ : ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని ఎరసానిగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన గీత కార్మికుడు గంగదేవి యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. యాదయ్య వ్యవసాయ బావి సమీపంలో ఉన్న పత్తి చేళ్లను పలువురు రైతులు తగులబెట్టగా గాలిదుమారంతో నిప్పురవ్వలు వచ్చి గడ్డివాముపై, కొట్టంపై పడడంతో పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 వేలు నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు కనుకుల వెంకట్‌రెడ్డి బాధితుడికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మనబోయిన సైదులు, రామలింగయ్య ఉన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

మర్రిగూడ: గ్రామాల్లో సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. ఆదివారం మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలో రాపోతు ముత్తయ్య అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పొట్ట యాదగిరి, సహాయ కార్యదర్శిగా మేతరి యాదయ్యతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, ఇస్కిల్ల మహేందర్, సిరగోని బలరాం, పున్నం లక్ష్మయ్య, ఎరజాల మహేందర్, నాగరాజు, శ్రీనివాస్, వెంకటయ్య, రాములు, సాయి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

ఆర్థికసాయం అందజేత


నకిరేకల్ : నగదు అందజేస్తున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్ : మున్సిపల్ కేంద్రానికి చెందిన ఫసియుద్దీన్ 14 నెలల కూతురు అయేషా ఫాతీమా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. వైద్య చికిత్సకు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.22,410 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కృష్ణప్రసాద్, మిస్కిన్, ముజీద్, ఫయాజ్, అజీమ్ వెంకటప్రసాద్ హరిప్రసాద్, శ్రీధర్, శ్రీను, సతీష్, కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన కొత్తగొల్ల యాలాద్రి నాలుగు రోజుల క్రితం ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలయ్యాడు. ఆయన ఆస్పత్రి ఖర్చుల కోసం ఆదివారం ఎంపీపీ శ్వేతారవీందర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాషిపాక రాములు, ఎడమ మల్లేష్, వల్లపు శోభన్ బాబు, బుడిగాపాక గోవర్ధన్, నేతల దేవేందర్ తదితరులు ఉన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్ : ఇటీవల సాంగటీస్ ఆర్ట్స్ అకాడమి, హన్మకొండలో నిర్వహించిన పద్మశ్రీ బ్రహ్మానందం పోర్ట్రైట్ ఛాలెంజ్ చిత్రకళా పోటీలో మిర్యాలగూడకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు చిత్రకారుడు ఇనుగుర్తి విజయ్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. విజయ్ డ్రాయింగ్ క్లాస్ విద్యార్థులు జూనియర్ విభాగంలో కె.లిఖిత, బి. ఉజ్వల, సీహెచ్ శృతికీర్తన, వి.నాగనందిని, కె.రీత్విక్‌రెడ్డిలు వేసిన చిత్రాలకు సర్టిఫికెట్స్ ఆఫ్ అప్రిషియేషన్స్ లభించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 332 చిత్రాలు పాల్గొన్నాయన్నారు. విజయ్ డ్రాయింగ్ స్కూల్ విద్యార్థులు వేసిన చిత్రాలను ఆ సంస్థ ప్రత్యేకంగా అభినందించిందన్నారు.